
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం : 14 : ఆగస్టు : 2025



నెలలుగా ఎదురుచూపు..

జిల్లావ్యాప్తంగా ఐదు నెలలుగా కమీషన్ అందకపోవడంతో 305 మంది రేషన్ డీలర్లు అవస్థ పడుతున్నారు.

8లో



ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందంటూ జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

9లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి బుధవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

రామయ్యకు విరాళాల వెల్లువ



ఈఓకు ఆభరణాలు అందజేస్తున్న దాతలు

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి బుధవారం పలువురు భక్తులు విరాళం అందించారు. శాశ్వత నిత్యాన్నదానానికి ఖమ్మానికి చెందిన కొండపల్లి వెంకటేశ్వరరావు, రాధ దంపతులు రూ.1,00,100, శ్రీరంగం వకుళ భాష్యం రూ.లక్ష ఆలయ ఈఓకు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఏఏ కామేశ్వర రావు, అవసరాల విజయలక్ష్మి దంపతులు రూ.ఆరు లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వామివారికి సమర్పించారు. దాతలకు ఈఓ రమాదేవి రశీదు అందజేశారు.

పంద్రాగస్టుకు ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రంలోని ప్రగతిమైదానంలో జరిగే 79వ స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి తుమ్మల వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన సబ్ కలెక్టర్



మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్

దమ్మపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గండుగులపల్లిలోని ఆయన నివాసంలో బుధవారం కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సత్తుపల్లి తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి పొందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



శిక్షణ కేంద్రంలో పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: డ్రైవింగ్‌ను నేర్చుకుని ఉపాధి పొందాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో డ్రైవింగ్ శిక్షణా కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 రోజులపాటు శిక్షణ ఉంటుందని, అనంతరం నిర్వహించే టెస్టులో ఉత్తీర్ణులయితే డ్రైవింగ్ లైసెన్సులను అందిస్తామని తెలిపారు. తద్వారా జెన్‌కో, ఐటీసీ, నవభారత్ వంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని, సొంత వాహనాలు సమకూర్చుకుని యజమానులుగా మారవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, డ్రైవింగ్ స్కూల్ శిక్షకురాలు మల్లేశ్వరి పాల్గొన్నారు.

చుక్కనీరూ ఇవ్వలె..



ములకలపల్లి మండలం వీకే రామవరం వద్ద సీతారామ పంప్‌హౌస్-2 మోటార్లు ఆన్ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు (ఫైల్)

సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌస్‌లు ప్రారంభించి ఏడాది

- ఇప్పటికీ జిల్లాలో ఒక్క ఎకరానికీ అందని సాగునీరు
- చివరి దశలో డీపీఆర్ అనుమతులు, యాతాలకుంట టన్నెల్ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ ప్రాజెక్టులను ఒక్కటిగా చేస్తూ 2016లో సీతారామ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. పలుమార్లు డిజైన్లలో మార్పులు చోటుచేసుకోగా 2018 చివర నుంచి పనులు మొదలయ్యాయి. 2023 డిసెంబర్ నాటికి మూడు పంప్‌హౌస్‌లు, 104 కి.మీ ప్రధాన కాలువతోపాటు సీతమ్మసాగర్ బరాజ్‌కు సంబంధించి 24 శాతం మేరకు పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)కు కేంద్రం నుంచి అనుమతి రాలేదు. కాగా బీఆర్ఎస్ హయాంలో రూ.7,500 కోట్లు పనులు జరిగాయని, అయినా ఒక్క ఎకరాకూ సాగునీరు ఇవ్వలేదని కాంగ్రెస్ విమర్శించింది. ప్రాజెక్టుకు డిజైన్లలో లోపాలు, ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పేర్కొంది. తమ ప్రభుత్వ హయాంలో ఫలితాలు ఇచ్చే పనులకే నిధులు ఇస్తామని తెలిపింది.

'రాజీవ్'తో దక్కింది భరోసానే

రూ.7,500 కోట్లు ఖర్చు చేసినా ఎక్కడా గోదావరి నీటిని వినియోగించుకున్న దాఖలాలు లేకపోవడంతో ఆగమేఘాలపై రాజీవ్ కెనాల్ రూపకల్పన చేశారు. 2024 జనవరిలో పనులు మొదలుపెడితే 2024 ఆగస్టు 15 నాటికి కాలువను పట్టాలెక్కించారు. ప్రధాన కాలువలో ప్యాచ్‌వర్క్ పనులు, వంతెనల నిర్మాణం, మూడు పంప్‌హౌస్‌ల వద్ద మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు, దుమ్ముగూడెం ఆనకట్ట దగ్గర హెడ్ రెగ్యులేటరీ నిర్మాణం వంటి పనులు చకచకా చేశారు. గతేడాది, ప్రస్తుత సీజన్‌లో కృష్ణాకు సమృద్ధిగా నీరు రావడంతో నాగార్జున సాగర్ ఆయకట్టుకు గోదావరి నీటిని ఇవ్వాల్సిన అవసరం రాలేదు. అవసరమైతే నాగార్జున సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు అందించగలమనే భరోసా దక్కింది అంతే.

ప్రారంభంకాని డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు

పంప్‌హౌస్ ప్రారంభోత్సవం సందర్భంగా 2025 ఖరీఫ్ సీజన్ నాటికి జిల్లాలో కనీసం 60 వేల కొత్త ఆయకట్టు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఇందుకోసం ప్యాకేజీ 1, 2 కింద డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గత ఆగస్టు చివర్లో ఆమోదం వస్తే, టెండర్ల ప్రక్రియనే 2025 జనవరి దాకా జరిగింది. ఎట్టకేలకు ఈ ఏడాది జూన్ నాటికి ఒకటో ప్యాకేజీకి సంబంధించిన అగ్రిమెంట్ పూర్తయింది. రెండో ప్యాకేజీ ఇంకా టెండర్ల దశలోనే మగ్గుతోంది. దీంతో డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు అసలు ప్రారంభమే కాలేదు. ఫలితంగా శంకుస్థాపన చేసిన తొమ్మిదేళ్లు, మోటార్లు ఆన్ చేసి ఏడాది పూర్తయినా జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా గోదావరి నీరు అందని పరిస్థితి నెలకొంది.

చివరి అంకంలో అనుమతులు

ఏడాది కాలంగా సీతారామ డీపీఆర్‌కు కేంద్రం నుంచి అనుమతులు సాధించే ప్రక్రియలో వేగం పెరిగింది. ఇప్పటికే టెక్నికల్ కమిటీ అనుమతులు వచ్చాయి. పర్యావరణ అనుమతులు కూడా సాధిస్తే సీతారామ డీపీఆర్‌కు మోక్షం లభించినట్టే. అయితే ఏడాది పూర్తయినా పూర్తిస్థాయిలో అనుమతులు రాలేదు. అవి వస్తేనే సీతమ్మ సాగర్ బరాజ్ నిర్మాణానికి సాంకేతిక అనుమతుల అడ్డంకులు తొలగిపోతాయి. సత్తుపల్లి ట్రంక్ కెనాల్‌కు సంబంధించి యాతాలకుంట టన్నెల్ పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఈ పనులు పూర్తయితే వచ్చే సీజన్‌కు సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకర్గాలకు నీరు అందించే పరిస్థితి ఉంటుంది. అదే విధంగా ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.13,057 కోట్ల నుంచి రూ.19,325 కోట్లకు పెంచేందుకు సర్కార్ ఆమోదం లభించింది.

భద్రాచలం, పినపాకకు చేయిచ్చినట్టేనా..?

గతేడాది పంప్‌హౌస్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా భద్రాచలం, పినపాక నియోజకర్గాలకు కూడా గోదావరి నీళ్లు ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇంతవరకు ఆ దిశగా ఒక్క పనీ జరగలేదు. సీతారామ ప్రాజెక్టు సంబంధించి ఎక్కడా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేకపోవడం పెద్ద పొరపాటని గతేడాది మంత్రులు తెలిపారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటివరకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంపై ఒక్కసారి కూడా ప్రభుత్వం స్పందించలేదు. రాజీవ్ సాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు ప్రస్తుతం సీతారామ ద్వారా చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పదే పదే ఇదే అంశాన్ని లేవనెత్తుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేదు.

క్రిస్టియన్ మైనారిటీల సమస్యలు పరిష్కరిస్తాం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న క్రిస్టియన్ మైనారిటీ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): క్రిస్టియన్ మైనారిటీల సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పాస్టర్స్ అసోసియేషన్‌తో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో శ్మశానవాటికలు, అభ్యంతరం లేని చర్చిలకు అనుమతులు, కులధ్రువీకరణ పత్రాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర సమస్యలను సమావేశంలో చర్చించారు. అనంతరం కలెక్టర్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ దీపక్‌జాన్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కె.సంజీవ రావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, సరైన సదుపాయాలు

బూర్గంపాడు : విద్యార్థినిలకు నాణ్యమైన విద్యతోపాటు సరైన సదుపాయాలు శుభ్రమైన వసతి, పోషకాహారంతో కూడిన భోజనం అందించినప్పుడే విద్యలో ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బుధవారం ఆయన బూర్గంపాడు తెలంగాణ గిరిజన బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల, హాస్టల్‌ను తనిఖీ చేశారు. వంటగది, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. సదుపాయాలు, మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని అన్నారు. పాఠశాల ప్రాంగణంలో మునగ, కరివేపాకు, నిమ్మ గడ్డి వంటి మొక్కలను నాటించాలని సూచించారు.

సాంకేతిక నైపుణ్యం అందిపుచ్చుకోవాలి

జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న డీఈఓ నాగలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: పిల్లలు చిన్నతనం నుంచే సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.నాగలక్ష్మి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యలో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ లిటరసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై కాంప్లెక్స్ స్థాయి రిసోర్స్ పర్సన్లకు కొత్తగూడెంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు గణితం సబ్జెక్ట్‌లో డిజిటల్ లిటరసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠ్యాంశాలను చేర్చినట్లు తెలిపారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, ప్రాథమిక స్థాయి విద్య పటిష్టంగా ఉంటే ఉన్నత స్థాయి రాణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.నాగరాజ శేఖర్, శ్రీనివాసరావు, శంకర్, స్వర్ణకుమారి, రవిబాబు, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి కళాశాలలో సదస్సు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా బుధవారం కళాశాల ఆడిటోరియంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. హోలిస్టిక్ అప్రోచ్ ఫర్ మెంటల్ అండ్ ఫిజికల్ వెల్‌నెస్ త్రూ స్పోర్ట్స్ అనే అంశంపై సదస్సు నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ఓయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ప్రొఫెసర్ ఎల్.లక్ష్మీరాథోడ్, ఎస్పీ రోహిత్‌రాజు హాజరయ్యారు. మొదట కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎస్పీ రోహిత్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని వ్యాపారులు దుకాణాల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దొంగ సొత్తును కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. బుధవారం కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ఐఎంఏ హాల్‌లో జిల్లాలోని ఆభరణల దుకాణాల యజమానులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలను అరికట్టవచ్చని, నిందితులను గుర్తించవచ్చని పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తుల నుంచి బంగారం కొనుగోలు చేయొద్దని సూచించారు. దుకాణాల పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దుకాణాల చుట్టు పక్కల నివసించే వ్యక్తుల కదలికలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాపార సముదాయాల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని, రాత్రి వేళల్లో గస్తీని పెంచుకోవాలని సూచించారు. ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సంఘటనల దృష్ట్యా సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, ఇల్లెందు, కొత్తగూడెం మణుగూరు, పాల్వంచ డీఎస్పీలు చంద్రభాను, అబ్దుల్ రెహమాన్, రవీందర్‌రెడ్డి, సతీష్‌కుమార్, సీఐలు రమాకాంత్, కరుణాకర్, ప్రతాప్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'కారుణ్యం'!

- డిపెండెంట్లకు ఉద్యోగాలు ఇచ్చేందుకు సుముఖత
- జెన్‌కో పరిధిలో మూడేళ్లుగా ఎదురుచూస్తున్న 110 కుటుంబాలు



జెన్‌కో హెచ్‌ఆర్ డైరెక్టర్ కుమార్ రాజుతో చర్చలు జరుపుతున్న యూనియన్ల నాయకులు

పాల్వంచ: టీజీ జెన్‌కో పరిధిలో కారుణ్య నియామకాల(డిపెండెంట్)కు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా ఎదురుచూస్తున్న బాధిత కుటుంబ సభ్యులకు వారంలోగా పోస్టింగ్‌లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్ విద్యుత్ సౌధలో జెన్‌కో డైరెక్టర్(హెచ్‌ఆర్)కుమార్ రాజ్‌ను పలు యూనియన్ల నాయకులు కలిసి విన్నవించగా హామి ఇచ్చారు. ఈ నెల 18వ తేదీలోగా పోస్టింగ్‌లు ఇవ్వాలని తొలుత యోచించినా, తేదీ ఇంకా ఖరారు కాలేదని తెలుస్తోంది. జెన్‌కో వ్యాప్తంగా విధులు నిర్వహిస్తూ అకాల మృత్యువాత పడ్డవారు సుమారు 110 మంది ఉన్నారు. అందులో అత్యధికంగా కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో 76 మంది ఉండటం గమనార్హం. వారి కుటుంబాలు ఉద్యోగాలు కోసం ఎదురుచూస్తున్నాయి. గతంలో డైరెక్టర్ పోస్టులు ఖాళీ ఉండటంతో వాయిదా ఈ ప్రక్రియ వాయిదా పడింది. ఇటీవల డైరెక్టర్ పోస్టులు భర్తీ చేయడంతో కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతమైంది.

సబ్ ఇంజనీర్ పోస్టులపై మీమాంస

గతంలో డిప్లొమా ఉన్న వారిని సబ్ ఇంజనీర్‌గా నియమించారు. గత సీఎండీ ప్రభాకర్ రావు హయాంలో ఇంజనీర్ కేడర్‌ను తొలగించి జూనియర్ అసిస్టెంట్(ఎల్‌డీసీ)గా ఉద్యోగాలు కల్పించారు. ఇది సాంకేతికంగా సరైంది కాదని, వారి చదువుకు, ఉద్యోగానికి సంబంధం లేదని సబ్ ఇంజనీర్ పోస్టు ఇవ్వాలని యూనియన్లు కోరుతున్నాయి. ఎన్‌పీడీసీఎల్, ట్రాన్స్‌కో సంస్థల్లో పాటించారని, సబ్ ఇంజనీర్‌నే పరిగణనలోకి తీసుకుని ఉద్యోగాలు ఇస్తున్నారని జెన్‌కో యాజమాన్యానికి వివరించారు. నూతనంగా నియామకమైన డైరెక్టర్లు మాత్రం డిప్లొమా, బీటెక్ ఉన్నవారిని సైతం జేపీఏ(జూనియర్ ప్లాంట్ అటెండెంట్)గా తీసుకుని సాధ్యమైనంత త్వరగా సబ్ ఇంజనీర్‌గా పదోన్నతులు కల్పిస్తామని పేర్కొనడంతోపాటు సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రొబేషనరీ పీరియడ్ దాటకుండా కన్వర్షన్ అయ్యే పరిస్థితి లేదని, కనీసం ఐదారేళ్లు పడుతుందని యూనియన్ నాయకులు చెబుతున్నారు. సబ్ ఇంజనీర్ పోస్టులు ఖాళీ ఉన్న నేపథ్యంలో సబ్ ఇంజనీర్‌గానే తీసుకోవాలని డైరెక్టర్ కుమార్ రాజును కోరారు. రాతపూర్వకంగా ఇవ్వాలని డైరెక్టర్ కోరగా బుధవారం విద్యుత్ సౌధలో 1104 కంపెనీ జనరల్ సెక్రటరీ దుర్గా అశోక్, 327 నాయకులు కుమార స్వామి, 1535 నాయకులు ఎం.ఎ.వజీర్, టీఆర్‌వీకేఎస్ నాయకుడు నవీన్ వర్మ వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు.

ఆలయ, పట్టణాభివృద్ధితో ప్లాన్

- భద్రాచలం దేవస్థాన మాస్టర్‌ప్లాన్‌పై సమావేశం
- చేర్పులు, మార్పులను వివరించిన స్థపతి
- భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఉంటుందని కలెక్టర్ వెల్లడి



నూతన డిజైన్ వివరాలను వివరిస్తున్న ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి. చిత్రంలో కలెక్టర్ జితేష్ తదితరులు

భద్రాచలం: భద్రగిరి స్థల చారిత్రక, ఆధ్యాత్మికతతోపాటు టూరిజం, సాంస్కృతిక మేలు కలయిక ఉండేలా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు ప్రముఖ స్థపతి సూర్యనారాయణ మూర్తి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఇటీవల భద్రాచలం పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్థపతి, దేవస్థానం వైదిక కమిటీ, అధికారులు, కలెక్టర్‌లు చర్చించి మాస్టర్‌ప్లాన్ ఫైనల్ చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో స్థపతి, కలెక్టర్, ఆలయ ఈఓ రమాదేవి, వైదిక కమిటీతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థపతి దేవస్థాన అభివృద్ధి నమూనాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మాట్లాడుతూ ప్లాన్‌లో దేవస్థానంతోపాటు పట్టణాభివృద్ధిని పొందుపరుస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు తగినట్లు మాస్టర్‌ప్లాన్ ఉంటుందన్నారు. డిజైన్ రూపకల్పనకు అందరి సలహాలు తీసుకుంటామన్నారు. ఏపీ అధికారుల సహకారంతో రాముడి భూముల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆలయ చుట్టు పక్కల పరిశీలించారు.

ప్రధాన ఆలయంలో మార్పులు లేకుండా.. !

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన డిజైన్ ప్రకారం ఆలయంలో పూర్తిగా మార్పులు చేపట్టాల్సి ఉండటంతో భారీగా నిధులు అవసరం కానున్నాయి. కానీ తాజా ప్రణాళికలో ప్రధాన ఆలయానికి మార్పులు లేకుండా ఆలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాతి కట్టడంతో నిర్మిస్తేనే సుమారు రూ. 150 నుంచి రూ. 200 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. వైదిక కమిటీ సలహాలు, సూచనల అనంతరం కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. ప్రభుత్వం డిజైన్ ఆమోదించాక నిధుల విడుదలపై స్పష్టత రానుంది.

తాజా నమూనాలో..

- దేవస్థాన అభివృద్ధి తాజా నమూనా గతంలో స్థపతి ఆనందసాయి రూపొందించిన నమూనాకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది.
- ప్రస్తుత నమూనా ప్రకారం రామదాసు నిర్మించిన ప్రధాన ఆలయం, ఇతర ఉపాలయాలకు మార్పులు లేకుండా, కేవలం చుట్టు పక్కల మాత్రమే అభివృద్ధి పనులను చేపట్టే అవకాశం ఉంది.
- చిత్రకూట మండపం తొలగించి, చుట్టూ స్తంభాలతో కాలి నడక మండపం ఏర్పాటు అవకాశం ఉంది.
- ప్రస్తుతం ఉన్న ఉత్తర, తూర్పు ద్వారాలకు మార్పులు చేపట్టి, దక్షిణ ద్వారాన్ని విస్తరించనున్నారు.
- గతంలో పేర్కొన్న మాఢ వీధుల ఏర్పాటు కాకుండా కేవలం చుట్టూ వీధుల పెంపు మాత్రమే ఉండనుంది.
- ఉత్తరం వైపు ప్రస్తుతం కట్టడాలు కూల్చిన ఖాళీ స్థలంలో దేవస్థాన అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం, వంటశాల ఏర్పాటు కానున్నాయి.
- క్యూలైన్ల ఆధునీకరణ, ప్రసాద విక్రయాల ఇతర పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కిన్నెరసానికి కొనసాగుతున్న వరద



కిన్నెరసాని జలాశయం

పాల్వంచరూరల్: ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయంలోకి వరద కొనసాగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 3 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, బుధవారం నీటిమట్టం 404.70 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటు ఎత్తి ఉంచి 4 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సింగరేణి అధికారుల నిరసన



సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ఫెర్ఫామెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) కోసం సింగరేణి అధికారులు చేపట్టిన ఆందోళన బుధవారం రెండోరోజుకు చేరింది. బుధవారం అధికారులు నల్లబ్యాడ్జీలు ధరించి సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) నాయకులు మాట్లాడుతూ 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన పీఆర్పీ పెండింగ్‌లో ఉందన్నారు. కోలిండియాలో ఏటా చెల్లిస్తున్నా, సింగరేణిలో రెండేళ్లుగా చెల్లించడం లేదని ఆరోపించారు.

మణుగూరు రూరల్ : పీఆర్పీ చెల్లించాలని కోరుతూ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 అధికారులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఓసీ-2 పిట్ సెక్రటరీ శనిగరపు కుమారస్వామి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.సురేష్‌కుమార్, రామ్‌శంకర్, భూక్యా భాంగ్యా, నరేష్, మెరుగు లింగబాబు, బుడ్డి బాబ్జీ, సుధాకర్ బాబు, ఎం.యుగంధర్, చక్రవర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాటర్ ట్యాంక్ ఎక్కిన గిరిజనుడు


వాటర్ ట్యాంక్‌పైన కూర్చున్న మోహన్‌రావు

అశ్వారావుపేట రూరల్: తనకు అర్హత ఉన్నా ప్రభుత్వం, అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని ఆగ్రహించిన ఓ గిరిజనుడు వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మామిళ్లవారిగూడెం గ్రామ పంచాయతీ ఊసిర్లగూడేనికి చెందిన జెట్టి మోహన్‌రావు.. అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని, మద్యం సేవించి మత్తులో మిషన్ భగీరథ ట్యాంక్‌పైకి ఎక్కాడు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోతే ట్యాంక్ పైనుంచి కిందకు దూకేస్తానని బెదిరించాడు. దాదాపు గంటపాటు హల్‌చల్ చేశాడు. స్థానికులు గమనించి మోహన్‌రావుకు సర్దిజెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సమయానికి మోహన్‌రావు కిందికి దిగాడు. పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకొని వివరాలు సేకరిస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ

కొత్తగూడెంటౌన్: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న తొమ్మిది మందికి కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్ బుధవారం తిరిగి అప్పగించారు. సీఐ మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణ పరిధిలోని పోస్టాఫీస్, బస్టాండ్, సింగరేణి ప్రధాన కార్యాలయాల ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నవారు ఫిర్యాదు చేయగా.. సెల్‌ఫోన్‌లను గుర్తించి తిరిగి అందించామని చెప్పారు.

సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా'


ర్యాలీలో పాల్గొన్న సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలోని సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్ కమాండెంట్ ముకేశ్‌కుమార్ సింగ్ ఆదేశాల మేరకు బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో భాగంగా చర్ల మండలంలోని పూసుగుప్ప, ఉంజుపల్లి, చెన్నాపురం, సత్యనారాయణపురం సీఆర్‌పీఎఫ్ క్యాంపుల సమీప గ్రామాల్లో జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన కార్యాక్రమాల్లో కమాండెంట్ ముకేశ్‌కుమార్‌సింగ్, డిప్యూటీ కమాండెంట్ రవిశంకర్‌శర్మ, రాజేశ్‌గోడ్రా, ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్‌సింగ్ మాట్లాడారు.


గురాయ్‌తోగులో పెద్దపులి పాదముద్రలు..!

కొత్తగూడ రేంజ్ నుంచి వస్తున్న పులి: రేంజర్

కరకగూడెం: కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న పెద్దపులి సంచారం తాజాగా వెలుగులోకి వచ్చింది. బుధవారం కరకగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన మేకలను అటవీ ప్రాంతానికి తీసుకెళ్తున్న క్రమంలో గురాయ్‌తోగు వద్ద పెద్దపులి పాదముద్రలను గమనించాడు. భయంతో వెంటనే మేకలతో సహా ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ విషయమై ఏడూళ్లబయ్యారం రేంజర్ తేజస్వినిని వివరణ కోరగా.. కొత్తగూడ రేంజ్ నుంచి పెద్దపులి వస్తున్నదని, రెండు రోజులుగా మండలంలోని పలు అటవీ ప్రాంతాల్లో పులి కోసం సిబ్బందితో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని, ఇప్పటివరకు ఎక్కడా దాని పాదముద్రలు కనిపించలేదని వివరించారు. లింగాల రేంజ్‌లో పులి సంచరిస్తున్నదని ఇటువైపు కూడా వచ్చే అవకాశం ఉందని, అటవీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా, పెద్దపులి సంచారంపై స్థానికుల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాల నేపథ్యంలో ఫారెస్ట్ సిబ్బందికి గాలింపు చర్యలు పెనుసవాల్‌గా మారాయి.

హోంగార్డుకు తీవ్ర గాయాలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం పెట్రోల్‌బంక్ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంతో హోంగార్డుకు తీవ్రగాయాలయ్యాయి. గోల్‌తండాకు చెందిన ఉపేంద్రయ్య(ఉపేందర్) హోంగార్డు(డ్రైవర్)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా పెట్రోల్ బంక్ సమీపాన కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో సీహెచ్‌సీలో చికిత్స అనంతరం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,052

నెలలుగా ఎదురుచూపు..


ఇల్లెందు నంబర్-2 బస్తీలోని రేషన్ షాపు

ఇల్లెందు: రేషన్ డీలర్లు ఐదు నెలలుగా కమీషన్ అందక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించినట్లు జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల స్టాక్ కూడా సకాలంలో పంపిణీ చేశారు. ఈ మూడు నెలల కమిషన్‌తో పాటు ఏప్రిల్, మే నెలల కమీషన్ కూడా పెండింగ్‌లో ఉంది. ఇలా ఐదు నెలల కమీషన్ ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవటం వల్ల రేషన్ డీలర్లు పరేషాన్ అవుతున్నారు. జిల్లాలో 443 దుకాణాలు ఉండగా 305 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచి లబ్ధిదారులకు రేషన్ అందించాల్సి ఉంది. ప్రభుత్వం క్వింటాకు రూ.140 కమీషన్ ఇవ్వాలి. అందులో నుంచి రేషన్ డీలర్ బియ్యం బస్తాల దిగుమతి కింద హమాలీలకు క్వింటాకు రూ.17 చెల్లించాల్సి ఉంది. 15 రోజుల పాటు రేషన్ షాపులో పనిచేసిన వర్కర్‌కు రోజుకు రూ.400 చెల్లించాల్సి ఉంది. రేషన్ షాపు కిరాయి కింద నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు చెల్లించాల్సి ఉంది. ఐదు నెలలుగా కమీషన్ జాప్యం కారణంగా ఇల్లు గడువటం కష్టంగా మారిందని, రేషన్ షాపు కిరాయితో పాటు వర్కర్, హమాలీలకు జేబు నుంచి చెల్లించి ఎదురు చూడాల్సి వస్తోందని మదనపడుతున్నారు. డీలర్ల పరిధిలో 2,97,189 రేషన్ కార్డులు ఉన్నాయి. గత జూన్ నెలాఖరు నాటికి 3 నెలల కోటా 17,287 మెట్రిక్ టన్నుల బియ్యం ఒకే నెలలో లబ్ధిదారులకు అందజేశారు.

కష్టాలు ఎన్నో..

రేషన్ దుకాణాలకు ఇళ్లు కిరాయికి ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. రేషన్ స్టాక్ భద్రపరిచితే పురుగులు వస్తాయని, పందికొక్కులు, ఎలుకల బెడద ఉంటుందని భయపడుతున్నారు. దీంతో పురాతన ఇళ్లల్లోనే ఈ రేషన్ షాపులు నడుస్తున్నాయి. పట్టణంలోని 13వ నంబర్‌బస్తీ 16వ వార్డులో అద్దె ఇల్లయిన రెండు గదుల రేకుల షెడ్డులో రేషన్ దుకాణం (3020040) నడుస్తోంది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల రేషన్ ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం మేరకు డీలర్లు మూడు నెలల స్టాక్‌ను ఐదు దఫాలుగా తెచ్చి అందించారు. స్టాక్ ఉన్న కాలంలో 15 రోజులపాటు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు షాపు తెరిచి ఉంచాల్సిందే. రేషన్ తీసుకునే సమయంలో మూడు దఫాలు వేలి ముద్రలు వేయాలి.

ఐదు నెలలుగా అందని కమీషన్..



ఐదు నెలలుగా కమీషన్ అందలేదు. ప్రతీ నెలా అందాల్సిన కమీషన్ ఐదు నెలలైనా రాకపోవడంతో కుటుంబాలు ఎలా గడుస్తాయి. క్వింటా రేషన్‌కు రూ.140 రావాల్సి ఉంది. ప్రభుత్వం ప్రతీ నెలా కమీషన్ అందజేయాలి. మా ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

-కె.దయాకర్, డీలర్, 2వ నంబర్‌బస్తీ

ప్రతీ నెలా అందజేయాలి..



జిల్లాలో 305 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరందరికి 5 నెలలుగా కమీషన్ అందలేదు. దీంతో రేషన్ షాపులు నడపటం కష్టంగా మారుతోంది. తక్షణం ప్రభుత్వం, పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించి కమీషన్ అందేలా చర్యలు తీసుకోవాలి. కమీషన్‌ను ప్రతీ నెలా ఇచ్చేలా చూడాలి.

-ఊకే శేఖర్‌రావు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

పెళ్లింట పెను విషాదం

- రోడ్డు ప్రమాదంలో వధువు అన్న, బంధువు దుర్మరణం
- వరుడికి కొత్త బట్టలు ఇచ్చేందుకు వెళ్తుండగా ఘటన



ప్రమాదానికి ముందు సోదరి హల్దీ ఫంక్షన్‌లో సాయిరంజిత్ (ఇన్‌సెట్) శ్రీనివాసరావు (ఫైల్)

తిరుమలాయపాలెం/ముదిగొండ: మూడేళ్ల క్రితం తండ్రి కన్నుమూశాడు. దీంతో కుటుంబ బాధ్యత తీసుకున్న యువకుడు అన్నీ తానై చెల్లెలి పెళ్లి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాడు. 24గంటలు గడిస్తే చెల్లెలిని పెళ్లి మండపంలో చూడాల్సిన ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఆయనతో మరో బంధువు సైతం మృతి చెందడంతో అంతసేపు పెళ్లి సందడి నెలకొన్న ఇంట్లో విషాదం అలుముకుంది. ముదిగొండ మండలం గోకినపల్లి సమీపాన బుధవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

వధువుకు మంగళస్నానం చేయించి...

తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలుకు చెందిన దొండేటి నాగేశ్వరరావు - పద్మ దంపతులకు కుమారుడు సాయిరంజిత్(34) కుమార్తె సాయి మనీషా ఉన్నారు. నాగేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో మూడేళ్ల క్రితం మృతిచెందాడు. సివిల్ ఇంజనీరింగ్ చేసిన రంజిత్ కేరళలో ఉద్యోగం చేస్తూ కుటుంబ బాధ్యతలు చూసుకుంటున్నాడు. ఆయన చెల్లి సాయిమనీషా వివాహం నల్లగొండ జిల్లా దామరచర్ల వాసితో నిశ్చయం కాగా గురువారం వివాహం జరగాల్సి ఉంది. ఈమేరకు పిండిప్రోలులో చెల్లి సాయి మనీషా మంగళస్నానాల కార్యక్రమంలో కుటుంబంతో సంతోషంగా గడిపిన రంజిత్ వరుడికి పెళ్లి బట్టలు, ఇతర సామగ్రి ఇచ్చేందుకు సమీప బంధువు, తిరుమలాయపాలెంకు చెందిన కొండబాల శ్రీనివాసరావు(65)తో కలిసి కారులో దామరచర్ల బయలుదేరాడు. అయితే, భారీ వర్షం వస్తుండడంతో ముదిగొండ మండలం గోకినపల్లి వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జుకాగా రంజిత్, శ్రీనివాసరావు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయం తెలియగానే పెళ్లి పనులతో హడావుడిగా ఉన్న ఆయన కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. తిరుమలాయపాలెంకు చెందిన శ్రీనివాసరావుకి భార్య రమాదేవి, కుమారుడు రమేష్‌బాబు, కుమార్తె శరణ్య ఉన్నారు. కొంతకాలంగా కుమార్తె శరణ్య ఇంట్లోనే ఉంటుండగా ఆయన మృతితో కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. ఘటనపై ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో ప్రమాదంలో ఇద్దరు మృతి


పల్లపు నరేష్ (ఫైల్)


రాంచరణ్‌సాయి (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి బ్రిడ్జి సమీపాన ఆటోను ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదం వివరాలు... ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఆటోడ్రైవర్ పల్లపు నరేష్(28) మంగళవారం అర్ధరాత్రి రోజు మాదిరిగానే కిరాయికి వెళ్లాడు. పలు ప్రాంతాల్లో తిరిగాక తెల్లవారుజామున నాయుడుపేట వైపు వెళ్తుండగా కరుణగిరి సమీపంలో మున్నేరు బ్రిడ్జి వద్దకు రాగానే వరంగల్ వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న ద్విచక్రవాహనదారుడు బలంగా ఢీకొట్టా డు. ఈ ఘటనలో ఆటో, ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమయ్యాయి. అలాగే, ఆటోడ్రైవర్ నరేష్ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, బైక్ నడుపుతున్న ఖమ్మం బొక్కలగడ్డకు చెందిన వున్నపు రాంచరణ్ సాయి(22)సైతం మృతిచెందాడు. ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న చల్లా వీరబాబు,రాంబాబుకు గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నరేష్ భార్య మాధవి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐముష్కరాజు తెలిపారు.

అక్వాడెక్ట్‌ను పరిశీలించిన కలెక్టర్

అడ్డుగా ఉన్న గుట్టల తొలగింపుపై సమీక్ష

సాక్షి ఎఫెక్ట్..


అక్వాడెక్ట్ పైనుంచి పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో ఆకేరుపై నిర్మించిన సీతారామ ప్రాజెక్టు అక్వాడెక్ట్‌కు అడ్డుగా బండరాళ్లు, గుట్టలు ఉండడంతో భారీ వర్షాల సమయాన వరద పోటెత్తే ప్రమాదముంది. ఈ విషయమై మంగళవారం 'సాక్షి'లో 'ఆకేరు అక్వాడెక్ట్‌కు అడ్డుగా గుట్టలు' శీర్షికన కథనం ప్రచురితం కాగా ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందించారు. ఈమేరకు మంగళవారం అక్వాడెక్ట్‌ను పరిశీలించేందుకు రాగా అడ్డుగా ఉన్న బండరాళ్లను పొక్లెయినర్‌తో తీయిస్తున్నారు. అయితే, వరద వచ్చే వరకు ఏం చేశారని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. భూసేకరణ సమస్య ఉందని అధికారులు చెప్పగా.. వరద ప్రవాహం పరిశీలనకు సీసీ కెమెరా ఏర్పాటుచేయాలని ఇరిగేషన్ డీఈ బాణాల రమేష్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం రాకాసితండా వాసులతో మాట్లాడిన కలెక్టర్ అనుదీప్ వరద పెరిగితే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని తెలిపారు. తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ఎంపీఓ సూర్యానారాయణ పాల్గొన్నారు. అలాగే, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి సైతం బుధవారం రాకాసి తండాను పరిశీలించిన అధికారులతో వరదపై సమీక్షించారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. కూసుమంచి సీఐ సంజీవ్, తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ పాల్గొన్నారు.

యువకుడిపై ఫిర్యాదు

కామేపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల హత్యకు ఓ యువకుడు కుట్ర పన్నాడని పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మద్దులపల్లికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సామా మోహన్‌రెడ్డి, నూకల ఉపేందర్ మాట్లాడుతూ తమను హత్య చేసేందుకు గడబోయిన హరీష్ మహబూబాబాద్ జిల్లాలోని ఓ రౌడీ షీటర్‌తో రూ.4 లక్షలకు సుపారీ కుదుర్చుకుని రూ.లక్ష చెల్లించినట్లు ఆడియో లీక్ అయిందని తెలిపారు. ఈమేరకు తమకు ప్రాణహానీ ఉన్నందున రక్షణ కల్పించడంతో పాటు పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. కాగా, బీఆర్‌ఎస్ నాయకులపై హత్యకు కుట్ర పన్నిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రౌడీయిజం పెరిగిందని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే రౌడీషీటర్ ఉంటుండడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. అలాగే, తమ బీఆర్‌ఎస్ నాయకుల హత్యకు కుట్ర పన్నిన వారిపై చర్యలు తీసుకోవాలని మద్దులపల్లి కాంగ్రెస్, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

టేకులపల్లి: కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మండలంలో పర్యటించింది. బుధవారం సేద్య విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. హేమశరత్‌చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ మండలంలోని బోడు గ్రామంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పత్తి పంటలో నీరు నిల్వకుండా చూసుకోవాలని సంచించారు. అధిక తేమతో వేరుకుళ్లు, మెగ్నీషియం ధాతు లోపం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వేరుకుళ్లు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి లేదా కార్బండిజమ్ 1 గ్రాము లీటర్ నీటికి కలిపి ప్రత్తి మొక్కలు గుంపులు గుంపులుగా చనిపోయిన ప్రదేశాల్లో మొక్కల మొదళ్లలో పోయాలని పేర్కొన్నారు. అధిక తేమ ఉన్న పరిస్థితుల్లో మొక్క పోషకాలను తీసుకోలేదు కాబట్టి 191919 లేదా 13045 (మల్టీకే) 10 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పైపాటుగా పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వెదజల్లే పద్ధతిలో విత్తిన వరి క్షేత్రాన్ని పరిశీలించి, కలుపు నివారణకు సైలోపాప్ బ్యూటైల్ పెనాక్సులమ్ లీటర్ కలుపు మందును, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కె.రమేశ్, భూక్య సైదులు నాయక్, నరేందర్, సక్రు తదితరులు పాల్గొన్నారు.

జవాన్ అనిల్‌కు కన్నీటి వీడ్కోలు

- సైనిక లాంఛనాలతో స్వగ్రామంలో అంత్యక్రియలు
- కి.మీ. మేర జాతీయ జెండాలతో ర్యాలీ


అనిల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే రాందాస్

కారేపల్లి: కాశ్మీర్ లోయలో జరిగిన ప్రమాదంలో కన్నుమూసిన ఆర్మీ జవాన్ బానోతు అనిల్‌కుమార్‌కు కుటుంబీకులు, స్థానికులు బుధవారం వీడ్కోలు పలికారు. జై జవాన్, అమరహే అనిల్‌కుమార్ అంటూ నినాదాల నడుమ విద్యార్థులు, యువత, స్థానికులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈనెల 11వ తేదీన కాశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన బానోతు అనిల్‌కుమార్ మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్‌కు అక్కడి నుంచి అక్కడి నుంచి బుధవారం ఉదయం ప్రత్యేక వాహనంలో కామేపల్లి కామేపల్లి పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈక్రమాన ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అనిల్ మృతదేహం నివాళులర్పించారు. అనంతరం కారేపల్లి క్రాస్‌లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

భారీగా హాజరైన జనం

కారేపల్లి క్రాస్ వద్దకు అనిల్ మృతదేహంతో కూడిన వాహనం చేరేసరికి యువకులు, విద్యార్థులు, స్థానికులు జాతీయ జెండాలో వేచి ఉన్నారు. ఆపై ఆయన మృతదేహం ఉన్న మిలటరీ వాహనాన్ని ఏడు కి.మీ. అనుసరిస్తూ స్వగ్రామానికి చేరారు. ఆపై అనిల్ మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి తీసుకొచ్చి నివాళులర్పించాక వ్యవసాయ పొలం తీసుకెళ్లారు. అక్కడ సైనిక అధికారులు గౌరవ వందనం సమర్పించి మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. ఆపై అనిల్ అంత్యక్రియలు పూర్తిచేశారు. మాజీ ఎమ్మెల్యేలు లావుడ్యా రాములునాయక్, బానోతు చంద్రావతి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ సతీమణి మంజుల పాల్గొన్నారు.

● నాన్న వచ్చాడురా...


చిన్నారితో అనిల్ భార్య, తల్లి

వేలాదిగా తరలివచ్చిన జన సందోహం నడుమ సూర్యతండాలోని స్వగృహానికి అనిల్ మృతదేహాన్ని తీసుకు రాగనాపే ఆయన తల్లి ద్వాలీ, భార్య రేణుక కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. 'దేశ రక్షణ కోసం వెళ్లి ఇలా తిరిగి వచ్చావా' అంటూ ఆయన తల్లి చేసిన రోదనలు అందరినీ కంట తడి పెట్టించాయి. అలాగే, 'మీ నాన్న వచ్చాడురా.. చిన్నా!' అంటూ అనిల్ కుమారుడికి తండ్రి మృతదేహాన్ని చూపిస్తూ రేణుక కన్నీరుమున్నీరవడం అక్కడి వారందరినీ కంటతడి పెట్టించింది.

ఉపాధి బిల్లులు స్వాహా చేశాడని ఫిర్యాదు

సుజాతనగర్: ఉపాధి హామీ పథకంలో మంజూరైన బిల్లులు స్వాహా చేశాడంటూ టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ)పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సర్వారం గ్రామ పంచాయతీ, గోపాతండా గ్రామానికి చెందిన మాలోత్ కవితకు ఉపాధిహామీ పథకంలో 2022లో జామతోట మంజూరు కాగా సదరు పొలంలో సుమారు 2,500 జామ మొక్కలు నాటారు. ఇందుకు సంబంధించిన వేజ్ పేమెంట్ రూ.1,24,000 మొక్కలు నాటిన రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. కాగా టీఏ చిమట సురేశ్ తనకు తెలిసిన రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చేసి వాటిని స్వాహా చేశాడు. తమకు రావాల్సిన బిల్లుల గురించి టీఏ సురేశ్‌ను తోట యజమాని రెండేళ్ల నుంచి అడుగుతుండగా ప్రాసెస్‌లో ఉన్నాయంటూ బుకాయించాడు. విసుగు చెందిన తోట యజమాని ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి వాకబు చేయగా నగదు 2024లోనే రైతుల ఖాతాల్లో జమ అయినట్లు తేలింది. టీఏ సురేశ్‌ను ప్రశ్నించగా.. తన వల్లనే తప్పు జరిగిందని, నగదును తిరిగి ఇస్తానని, కొంత సమయం కావాలంటూ రూ.లక్షకు చెక్కు ఇచ్చాడు. దానిని పట్టుకుని యజమాని బ్యాంకుకు వెళ్లగా చెక్కులోని సంతకం నకిలీదని తెలిసింది. దీంతో సురేశ్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రతిని ఎంపీడీఓ బి.భారతికి కూడా అందజేశారు. ఎంపీడీఓను ఫోన్‌లో వివరణ కోరగా విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

గంజాయి పట్టివేత?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం మీదుగా 6 కేజీల గంజాయిని తరలిస్తుండగా టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కాగా, గంజాయిని ఎక్కడి నుంచి ఎక్కడికి.. ఎంత మంది తరలిస్తున్నారు? దాని విలువ ఎంత? అనే వివరాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

కేసు నమోదు

చంద్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన దండుగుల దినేశ్‌పై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ బుధవారం రాత్రి తెలిపారు. అయన్నపాలేనికి చెందిన దినేశ్‌కు అదే గ్రామానికి చెందిన కృష్ణవేణితో ఆరేళ్ల కిందట వివాహమైంది. మద్యానికి బానిసైన దినేశ్ భార్యను అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో కృష్ణవేణి ఫిర్యాదు మేరకు దినేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అతివేగంగా కారు నడిపిన డ్రైవర్‌పై ఫిర్యాదు

ఇల్లెందురూరల్: అతివేగంగా కారు నడిపి రోడ్డు ప్రమాదానికి కారకుడైన కారుడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని టేకులపల్లి మండలం కోక్యాతండాకు చెందిన ఆటోడ్రైవర్ గుగులోత్ అరుణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గార్ల మండలం సీతంపేట గ్రామానికి కుటుంబంతో సహా ఆటోలో వెళ్లి వస్తుండగా రేపల్లెవాడ స్టేజీ సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన కారు.. తన ఆటోను ఢీకొట్టిందని, తనతో పాటు భార్య గాయపడిందని, ఆటో పూర్తిగా ధ్వంసమైందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కారు (టీఎస్ 04 ఈడీ 3828) డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

ఇసుక లారీల అడ్డగింత


గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిచిన లారీలు

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని కమలాపురం గ్రామస్తులు ఇసుక లారీలను అడ్డుకున్న ఘటన బుధవారం మణుగూరులో చోటుచేసుకుంది. కమలాపురం, రాయిగూడెం, కోడిముత్తయ్య గుంపు ఇసుక డీసిల్టేషన్‌తో పాటు చినరాయిగూడెం ఇసుక సొసైటీల నుంచి పరిమితికి మించి లారీల రాకపోకలు సాగుతున్నాయి. అధిక లోడ్‌తో రోడ్లు దెబ్బతింటున్నాయి. మిషన్ భగీరథ పైపులు దెబ్బతిని ఐదు రోజులుగా నీటి సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామస్తులు ఇసుక కోసం వచ్చిన వందలాది లారీలను నిలిపివేశారు. గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కరకగూడెం: మండలంలోని భట్టుపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ పీవీఎన్ రావు కథనం ప్రకారం.. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,000 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పొట్టకూటి కోసం వచ్చి అనంతలోకాలకు..


లక్ష్మి మృతదేహం

అశ్వాపురం: పొట్ట కూటి కోసం వచ్చిన ఓ మహిళ గుండెపోటుతో బుధవారం మృతిచెందింది. ఏపీ రాష్ట్రం బాపట్ల జిల్లా రేపల్లే మండలం పోతుమేరక గ్రామానికి చెందిన ఏమిలేని లక్ష్మి (55) అశ్వాపురం మండలం మొండికుంటలో నాటు వేస్తూ గుండెనొప్పితో కుప్పకూలింది. స్థానికులు 108లో మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మికి భర్త, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ప్రత్యేక వాహనంలో లక్ష్మి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె స్వస్థలానికి తరలించారు. కాగా, లక్ష్మి మృతితో ఆమెతో వచ్చినవారు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

వ్యక్తి ఆత్మహత్య..

భద్రాచలంఅర్బన్: కుటుంబ కలహాలతో పట్టణంలోని శిల్పినగర్‌కి చెందిన తాతా సిద్ధయ్య మంగళవారం పురుగులమందు సేవించాడు. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. 20 ఏళ్ల కిందట సిద్ధయ్యకు సాంబలక్ష్మితో వివాహం జరిగింది. సిద్ధయ్య మద్యానికి బానిసవ్వడంతో ఇటీవల ఇద్దరి మధ్య తగాదాలు జరుగుతున్నాయి. మంగళవారం సిద్ధయ్య మద్యంలో పురుగులమందు కలుపుకుని తాగగా.. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో సిద్ధయ్య మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. అతని తల్లి నాంచారమ్మ ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

చెట్టును ఢీకొట్టిన లారీ

ములకలపల్లి: అదుపుతప్పి లారీ చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కిష్టారం గ్రామానికి చెందిన లారీడ్రైవర్ బీరవెల్లి కల్యాణ్‌కుమార్ సత్తుపల్లి నుంచి సారపాకకు బొగ్గు లోడుతో వెళ్తున్నాడు. మూకమామిడి క్రాస్‌రోడ్డు సమీపంలో లారీ అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కల్యాణ్‌కుమార్‌ను 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.